సాక్షి తిరుపతి



రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. తొట్టంబేడు మండల పరిధిలోని స్వర్ణముఖ నదిలో ఇసుకను తోడేస్తోంది. - 8లో



అటకెక్కిన 'వంద పడకలు'

సత్యవేడు సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మా మాటే మరిచారు. - 8లో



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తిరుపతి నగరంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. - 8లో

సోమవారం ׀ 25 ׀ ఆగస్టు ׀ 2025




ఇళ్లను కూల్చివేస్తున్న జేసీబీ

గూడు కొట్టి!

నోటీసులు అందించలేదు. కనీస సమాచారం లేదు. నిరుపేదలనే కనికరం లేదు. నిరాశ్రయులను చేస్తున్నామనే ఆలోచన లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకున్నారనే కారణంతో పేదలపై కూటమి సర్కారు కక్షగట్టింది. శ్రీకాళహస్తి సమీపంలోని రాజీవ్‌నగర్‌లో వేకువజామునే రెవెన్యూ..పురపాలక అధికారులతోపాటు పోలీసు బలగాలను మోహరించింది. నివాసాల్లోని వస్తువులను వీధిలోకి విసిరేసింది. నిద్రిస్తున్న వారిని సైతం బలవంతంగా బయటకు లాగి పడేసింది. జేసీబీలతో విధ్వంసం సృష్టించింది. సుమారు నలభై గృహాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేసింది. బాధితుల ఆక్రందనలను అధికార బలంతో అణగదొక్కేసింది.

ఆక్రమణల పేరుతో ఇళ్లను పడగొట్టించిన ప్రభుత్వం

- నిర్దాక్షిణ్యంగా నిర్మాణాల తొలగింపు
- నిరుపేదలను నిరాశ్రయులుగా మార్చేసిన అధికార యంత్రాంగం
- కాళ్లావేళ్లా పడినా కనికరం లేకుండా కూల్చివేతలు
- లబోదిబోమంటున్న బాధితులు


రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా

శ్రీకాళహస్తి : పట్టణ సమీపంలోని రాజీవ్‌నగర్‌లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూటమి ప్రభుత్వం కూల్చివేయించింది. సర్కారు భూమిలో అక్రమంగా ఇళ్లు కట్టుకున్నారనే సాకుతో దారుణంగా వ్యవహరించింది. ఆదివారం వేకువజాము నుంచే కూల్చివేత ప్రక్రియను మొదలుపెట్టింది. బాధితులు కాళ్లావేళ్లా పడినా పట్టించుకోకుండా జేసీబీలతో సుమారు 40 గృహాలను పడగొట్టించింది.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచే..

శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రోడ్డుకు ఇరువైపులా రాజీవ్‌నగర్‌లో పెద్దసంఖ్యలో పేదలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వీరిపై ప్రధానంగా పచ్చ నేతలు కక్ష పెంచుకున్నారు. అక్కడి నిర్మాణాలన్నీ అక్రమ కట్టడాలు అంటూ మొదట ప్రచారం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ఏడాది జూన్‌లోనే కూల్చివేతలు చేపట్టారు. పలువురి ఇళ్లను పడగొట్టి రాక్షసానందం పొందారు. కడుపు కట్టుకుని ఇల్లు నిర్మించుకున్నారనే కనికరం కూడా లేకుండా పదుల సంఖ్యలో కట్టడాలను కూల్చేశారు. మళ్లీ అదే తరహాలో ఆదివారం రాజీవ్‌నగర్‌లో విధ్వంసకాండకు తెరతీశారు.

తెల్లారకముందే..


నేలమట్టమైన ఇల్లు

రాజీవ్‌నగర్‌లో ఎక్కువ మంది పేదలు, దళితులే నివాసాలు ఏర్పరుచుకున్నారు. కూలీ నాలీ చేసుకుంటూ పొట్టపోసుకునేవారే అధికులు ఉన్నారు. పైసా పైసా కూడబెట్టుకుని సొంత గూడు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్నారని అధికారుల అండతో టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారు. తెల్లారకముందే రెవెన్యూ, మున్సిపల్ అధికారులతోపాటు భారీ సంఖ్యలో పోలీసులను రంగంలోకి దించారు. ఇళ్లలో నిద్రిస్తున్న వారిని సైతం బయటకు లాక్కువచ్చి పడేశారు. సామాన్లను వీధిలోకి విసిరేశారు. జేసీబీలతో నిర్దాక్షిణ్యంగా గృహాలను కూల్చేశారు.

పట్టాలు ఎలా ఇచ్చారు?

అక్రమ కట్టడాలు అంటూ ఇప్పుడు అధికారులు తొలగించిన స్థలాలకు పట్టాలు ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. సర్వే నంబర్ 241, 372, 373, 414లో వంద అడుగుల రోడ్డు, పార్కులు, స్కూళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పురపాలక పరిధిలోని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయడమేంటనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారుల నిర్వాకంతో అమాయకులు శిక్ష అనుభవించాల్సి వస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదెక్కడి దుర్మార్గం

ముందస్తు సమాచారం కూడా లేకుండా ఇళ్లను కూల్చివేయడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ బతుకులను వీధిన పడేశారని మండిపడ్డారు. ఇదెక్కడి దుర్మార్గం అంటూ వాపోయారు. ఇల్లు కట్టుకునేప్పుడే అధికారులు అడ్డుకుని ఉంటే నిర్మాణం నిలిపివేసుకునే వాళ్లమన్నారు. ఇప్పుడు తీరిగ్గా వచ్చి తమ జీవితాలను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నిస్తున్న మహిళ


వృద్ధురాలిని బయటకు లాగేస్తున్న పోలీసులు

పట్టా ఉన్నా కూల్చేశారు

మా తల్లి వెంకటమ్మ పేరు మీద రెవెన్యూ అధికారులు రెండు సెంట్ల స్థలం కేటాయించారు. పట్టా కూడా ఇచ్చారు. ఎంతో కష్టపడి ఇల్లు కట్టుకుంటే ఇప్పుడు కూల్చి వేశారు. ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదు. వస్తువులు తీసుకెళ్లే అవకాశం కూడా ఇవ్వకుండా దారుణంగా ఇల్లు కూల్చేశారు. ఇది అమానుషం.

– కచ్చాల వెంకటయ్య, బాధితుడు

అధికారులపై చర్యలు తీసుకోవాలి

అక్రమ కట్టడాల పేరుతో రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గం. పబ్లిక్ ప్రదేశాల్లో ఇంటి పట్టాలు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులపై ముందుగా చర్యలు తీసుకోవాలి. ఆ తర్వాతే ఈ నిర్మాణాల జోలికి రావాలి.

– గంధం మణి, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి

పేదల కడుపు కొట్టకండి



ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రెండు సెంట్లు కాదు మూడు సెంట్లు ఇస్తామని పేదలను నమ్మించి గెలిచింది. ఆ తరువాత పేదల ఇళ్లను కూల్చడం ప్రారంభించింది. ఇది భావ్యం కాదు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు 500 ఇళ్లు, పునాదాలు తొలగించారు. ఇది చాలా బాధాకరం. శని, ఆదివారాల్లో ఎక్కడ ఇళ్లు కూల్చుతారో తెలియని పరిస్థితి నెలకొంది. గెలిచిన తరువాత కూల్చడమే పనిగా పెట్టుకుని పేదల కడుపు కొడుతున్నారు.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే


నిర్మాణంలోని ఇళ్లను కూలుస్తూ...


కూలిన నిరుపేద కలల సౌధం..


దిబ్బగా మారిన ఇంట్లో సామాన్లు తీసుకునేందుకు వెళుతున్న బాధితుడు

కేంద్ర పథకం.. రెండు నెలలు ఎగనామం!

తిరుపతి అర్బన్: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై), జననీ సురక్ష యోజన (జేఎస్‌వై) పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాల ద్వారా పోషకాహారం అందించేందుకు మూడు విడతల్లో రూ.6వేల చొప్పున పంపిణీ చేసేవారు. అయితే అధికారుల అలసత్వం కారణంగా జూన్, జూలైకు సంబంధించి లబ్ధిదారులకు ఈ పథకాల ఫలాలు దూరమయ్యాయి. వివరాలు.. జిల్లాలోనే 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గర్భిణులు 10,149 మంది, బాలింతలు 5,818 మంది ఉన్నారు. ఈ రెండు పథకాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మే 31వ తేదీ వరకు నిర్వహించారు. తర్వాత ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ రెండు పథకాల నిర్వహణ బాధ్యతలను ఐసీడీఎస్‌కు అప్పగించారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు సర్వే ప్రక్రియను ఆగస్టు 1వ తేదీ నుంచి మొదలు పెట్టారు. ఇప్పటి వరకు కేవలం 50శాతం ప్రక్రియను పూర్తి చేశారు. ఆ మేరకు ఈ పథకానికి ఎవరు అర్హులనే అంశాలను నమోదు చేసుకుంటున్నారు. దీంతో జూన్, జూలైలోని గర్భిణులు, బాలింతలకు ఈ పథకం వర్తించడం లేదు. ఇక తమ వివరాలు ఎవరు తీసుకుంటారు అంటూ వారు ఆవేదన చెందుతున్నారు. దాదాపుగా ఆ రెండు నెలల్లో గర్భిణులు, బాలింతలు 900మంది వరకు ఉన్నట్లు సమాచారం. అధికారులు మాత్రం ఒకరి శాఖపై మరొకరు నెపం నెట్టేస్తున్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్ : దివ్యాంగుల పెన్షన్ల రద్దుపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లా నేతలు దేవానంద్, శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైకల్య శాతం తగ్గించి ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేల పింఛన్‌ను రూ.6 వేలకు కోతపెట్టారని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్నికల హామీని ఉల్లంఘించి దివ్యాంగులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. డాక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చి అధిక సంఖ్యలో దివ్యాంగులపై వేటు వేయించారని విమర్శించారు. సెప్టెంబర్‌లో దివ్యాంగులందరికీ యథావిధిగా పెన్షను పంపిణీ చేయాలని, అనుమానం ఉన్నవారికి మాత్రమే రీవెరిఫికేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్వాకం కారణంగా జిల్లాలో 25 వేల కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించి అర్హులందరికీ అందించాలని కోరారు. వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వందవాసి నాగరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, గురుప్రసాద్, సంపూర్ణ పాల్గొన్నారు.

2 నుంచి జమ్మలమడుగులో పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. 1వ తేదీ సాయంత్రం పుణ్యాహవచనం, మృత్సంగ్రహణంతో అంకురార్పణం చేపట్టనున్నట్లు తెలిపింది. 2న చతుష్టార్చాన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం 6 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. 3న పవిత్ర సమర్పణ, 4న పూర్ణాహుతి, పవిత్ర వితరణ, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపుతో ఉత్సవాలు పరిపూర్ణం కానున్నట్లు పేర్కొంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఏ తెలుగులో జిల్లా ఫస్ట్ విజయ్



సత్యవేడు: డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగుకు సంబంధించి సత్యవేడు మండలం నీలితొట్టికండ్రిగకు చెందిన ఎస్.విజయ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 87.01907 మార్కులతో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. అలాగే టీజీటీలోనూ 80.70 మార్కులతో జోనల్ స్థాయి నాలుగో ర్యాంకు పొందారు.

డిగ్రీ దరఖాస్తులకు రేపే ఆఖరి గడువు

తిరుపతి సిటీ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పలు డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనుంది. ఇప్పటికి వరకు జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలో 21 విభాగాలకు సంబంధించి సుమారు 23వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

టీచర్లకు ఇంగ్లిష్ స్కిల్స్‌పై శిక్షణ


శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్న నేపథ్యంలో టీచర్లకు ఆంగ్లంపై పూర్తి పరిజ్ఞానం ఉండాల్సిన అవసరముందని విల్ టూ కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ (హైదరాబాద్) సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం తిరుచానూరు జెడ్పీ హైస్కూల్లో 100 మంది టీచర్లకు ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ ఇచ్చారు. గౌడ్ మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డీఈఓ కేవీఎస్ కుమార్, సమగ్రశిక్ష అడిషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ ఇంగ్లిష్‌లో మెలకువలను నేర్చుకుంటే విద్యార్థులకు చక్కగా బోధించవచ్చని సూచించారు. సెక్టోరియల్ అధికారులు సారథి, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

అది అన్న తాలుకా బండి..

ముట్టుకుంటే మసైపోతావ్


నకిలీ బిల్లుతో పట్టుబడి పోలీసుల అదుపులో టిప్పర్లు (ఫైల్)

కూటమి నేతలు అక్రమంగా గ్రావెల్‌ను దోచేస్తున్నారు. నకిలీ బిల్లులతో మాయ చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. అనుమతి పేరుతో హద్దులు లేకుండా ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నారు. అధికార పార్టీ నేతలు కావడంతో అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడడంలేదు. ప్రజలు ఇదేంటని ప్రశ్నిస్తే ..అది అన్న తాలుకా బండి అంటూ రౌడీలతో బెదిరింపులు, దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఓ ప్రజాప్రతినిధి కనుసైగలో అక్రమ క్వారీలు

- నకిలీ బిల్లులతో దందా
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- యథేచ్ఛగా తమిళనాడుకు తరలిపోతున్న గ్రావెల్
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టుకున్నా.. వదిలేస్తున్న అధికారులు
- తమిళనాడు రౌడీలతో బెదిరింపులు

సాక్షి టాస్క్ ఫోర్స్ : కూటమి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ ప్రజాప్రతినిధి, కూటమి నేతలు విజయపురం మండలంలోని మహారాజపురం సమీపంలోని కొండలో గ్రావెల్‌ను విచ్చలవిడిగా జేసీబీలను పెట్టి టిప్పర్లతో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు తరలించేస్తున్నారు. మైన్స్ విభాగంలో అనుమతి తీసుకున్నామంటూ గోరంత అనుమతి చూపుతూ కొండంత దోచేస్తున్నారు. నకిలీ బిల్లులతో కొన్ని నెలలుగా గుట్టల్లోని ఎర్ర మట్టిని తీసుకుపోతుంటే స్థానిక ప్రజలు పట్టుకొన్నారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తుంటే పోలీసు, రెవెన్యూ యంత్రాంగం మాకు సంబంధం లేదంటూ చేతులు ఎత్తేశారు. ప్రజలు అడిగితే ..ఇది అన్న తాలుకా బండి ఎవ్వరైనా ఆపినా...అడిగినా మసైపోతారంటూ బెదిరిస్తున్నారు.

ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు

మండలంలోని మహారాజపురం గ్రావెల్ క్వారీలో ఆరు నెలలుగా గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఇందులో ఒక ప్రైవేటు వ్యక్తికి 11,800 క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. తనకు ఇచ్చిన పర్మిట్ గడువు అయిపోయినా..నకిలీ బిల్లుతో గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు వేడుక చూస్తున్నారు. ఒక రోజుకు 1000 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తీసినా 12 రోజుల్లోనే ఇచ్చిన అనుమతులు అయిపోతాయి. రోజుకు వంద టిప్పర్లకు పైగా తరలిస్తూ ఏడాది పాటుగా జరుగుతుంటే ఎన్ని వేల క్యూబిక్ మీటర్ల మేర అనుమతులు లేకుండా దోచేశారో కళ్లకు కట్టినట్లు తెలుస్తోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఇటీవల టిప్పర్‌ను అడ్డుకొని బిల్లులు పరిశీలించగా అవన్నీ నకిలీ అని తేలింది. దీంతో టిప్పర్లను పోలీసు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అయితే అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి, టిప్పర్లలను వదిలివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్వారీ వద్ద తమిళనాడు రౌడీలు


అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న స్థానికులు

క్వారీ ప్రాంతంలో ఎవ్వరూ పరిశీలనకు వెళ్లకుండా తమిళనాడుకు చెందిన రౌడీలను కాపలా ఉంచారు. టిప్పర్లను ఎవ్వరైన అడ్డుకొన్నా... అక్కడి వారిని నిలదీసినా...రౌడీల చేత బెదిరింపులకు దిగుతుండడంతో స్థానిక ప్రజలను సైతం భయందోళనకు గురిచేస్తోంది. ఇటీవల ఓ వ్యక్తి మహారాజపురం కొండపై జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ప్రశ్నించగా అతడిని రౌడీలు దేహశుద్ధి చేసినట్లు సమాచారం. దీంతో స్థానికులు సైతం ప్రశ్నించడానికి భయపడుతున్నారు.

ప్రశ్నిస్తే..బెదిరింపులే

నకిలీ బిల్లులతో వెళ్తున్న టిప్పర్లను పట్టుకున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మహారాజపురం క్వారీ నుంచి గ్రావెల్ తరలించేవారిని ఎవరైనా ప్రశ్నిస్తే ఇది ఎమ్మెల్యేకు చెందినవి అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం లారీలను తనిఖీ చేయడానికి భయపడుతున్నారు. ఈ క్రమంలో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది.


మహారాజపురం కొండపై గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం


గ్రావెల్ తవ్వేయడంతో రాళ్లతో నిండిన పచ్చని కొండ

తుమ్మలగుంటలో

తుంబుర గణపతి

- 10 అడుగుల ఎత్తు,7 అడుగుల వెడల్పుతో మట్టి విగ్రహం
- ప్రత్యేకంగా తయారు చేయిస్తున్న చెవిరెడ్డి కుటుంబీకులు



తిరుపతి రూరల్ : వినాయకచవితి పర్వదినం వస్తోందంటే చాలు.. అందరి కళ్లు తుమ్మలగుంట వైపు చూస్తుంటాయి. గత పాతికేళ్లుగా చెవిరెడ్డి కుటుంబీకులు విభిన్న ఆకృతులతో గణపతి ప్రతిమను తయారు చేయించి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే 10 అడుగుల ఎత్తు, 7 అడుగుల వెడల్పుతో తుంబుర వినాయకుడి ప్రతిమను సిద్ధం చేయిస్తున్నారు. పరమేశ్వరుని ఒడిలో కూర్చుని తుంబుర చేతబట్టుకుని ధ్యానం చేస్తున్నట్లుగా గణేశుడి విగ్రహం కొలువుదీరనుంది. పర్యావరణ హితంగా చిట్టి, రాజ్ కుమార్ ఆధ్వర్యంలో 10 మంది కార్మికులు నాలుగు రోజులుగా శ్రమించి ప్రతిమను తీర్చిదిద్దారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 27వ తేదీ ఉదయం కల్యాణ వెంకన్న ఆలయంలోని కల్యాణ మండపంలో గణపతిని కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

క్లుప్తంగా

మెగా డీఎస్సీ స్పోర్ట్ కోటాలో అవకతవకలు!

తిరుపతి సిటీ : మెగా డీఎస్సీ స్పోర్ట్ కోటాలో భారీగా అవకతవకలు జరిగినట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి చీనేపల్లి కిరణ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు శాప్ ఛైర్మన్ రవినాయుడుకు బహిరంగ లేఖ రాశారు. డీఎస్సీ క్రీడా విభాగం కింద ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న సుమారు 889 మంది అభ్యర్థుల్లో ఫేక్ సర్టిఫికెట్లు పొందిన వారు ఉన్నారని శాప్ ఛైర్మన్ ప్రకటించడం దుర్మార్గమన్నారు. నిజమైన క్రీడాకారులకు నకిలీ సర్టిఫికెట్లతో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకే ఒక్కడు.. ఐదు ఉద్యోగాలు


నల్లపాటి శివకుమార్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన నల్లపాటి రాధాకృష్ణయ్య, జానకమ్మ కుమారుడు శివకుమార్ మెగా డీఎస్సీలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఎస్జీటీలో 24వ ర్యాంకు, ఎస్ఏ తెలుగులో 34వ ర్యాంకు, ఎస్ఏ సోషల్‌లో 67వ ర్యాంకు, టీజీటీ సోషల్‌లో 77వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 310వ ర్యాంకు సాధించి ఐదు ఉద్యోగాలకు అర్హత పొందారు. పేదింటికి చెందిన శివకుమార్ కూలి పనులకు వెళుతూ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ చదివడమే కాకుండా ఇంటి వద్దనే ఉంటూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. ఈ మేరకు అద్భుత ఫలితాలు సాధించిన శివకుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నారు. అలాగే మండల, డివిజన్‌స్థాయిలో సైతం ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు తెలియజేసే అవకాశముంది.

నాన్ టీచింగ్ సంఘానికి నూతన కార్యవర్గం



తిరుపతి సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ సంఘానికి నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా విశ్వేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా మాధవనివాస్, నజీర్, మహిళా కార్యదర్శిగా శిరీష, కార్యనిర్వాహక కార్యదర్శిగా మునిశంకర్‌రెడ్డి, చరణ్, ప్రతాప్‌గాంధీ, లక్ష్మీనారాయణ, మంజునాథ్, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, రాగ దీప్తి, మనోజ్ రెడ్డి ఎన్నికయ్యారు.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,858 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,034 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.93 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.


సత్యవేడులో నిరుపయోగంగా ఆస్పత్రి భవనం

అటకెక్కిన వంద పడకలు

సత్యవేడు అభివృద్ధి మాటలకే పరిమితమైంది. ప్రధానంగా స్థానిక సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. ఇక్కడి సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా పేదలకు నామమాత్రపు వైద్యసేవలే అందుతున్నాయి. అత్యాధునిక వసతులు నిరుపయోగంగా మారిపోయాయి. చుట్టుపక్కల మండలాల ప్రజలకు నాణ్యమైన చికిత్సలు దూరమయ్యాయి. ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా అభివృద్ధి ఫలాలు అటకెక్కాయి.

- సత్యవేడులో నిరుపయోగంగా రూ.7 కోట్ల ఆస్పత్రి భవనం
- పేదలకు దూరంగా నాణ్యమైన వైద్యం
- అత్యాధునిక వసతులు ఉన్నా.. ప్రయోజనం శూన్యం
- చంద్రబాబు హామీ అమలుకు నోచుకోని వైనం

వరదయ్యపాళెం : ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడులో పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు కలగా మారాయి. ప్రస్తుతమున్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) 100 పడకల ఆస్పత్రిగా అభివద్ధి చేయాలనే డిమాండ్లు ఆకాంక్షలుగానే మిగిలిపోయాయి. సుమారు 53వేల మంది జనాభా కలిగిన సత్యవేడు మండలంతో పాటు వరదయ్యపాళెం, నాగలాపురం మండలాల ప్రజల వైద్య సేవల కోసం సామాజిక ఆరోగ్య కేంద్రంగా 50 పడకల స్థాయితో 1999లో ఈ ఆస్పత్రిని విస్తరించారు. అప్పటి నుంచి ఆస్పత్రి అభివద్ధిలో ఏమాత్రం పురోగతి లేదు. వైద్యసేవలు సైతం నామమాత్రంగా మారడమే తప్ప మెరుగైన చికిత్సలు అందుబాటులో లేవు. దీంతో సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు నాణ్యమైన వైద్యసేవల కోసం అటు తమిళనాడులోని చెన్నై, తిరువళ్లూరు, ఇటు తిరుపతికి పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దాతలు ఇచ్చిన సామగ్రి నిరుపయోగం

సీహెచ్‌సీకి సత్యవేడు సమీపంలోని శ్రీసిటీ, హీరో, అపోలో పరిశ్రమలు వేర్వేరుగా బెడ్లు, ఆక్సిజన్ కన్వర్టేటర్లు, ఇతర పరికరాలను పేదల ఆరోగ్యం కోసం వితరణగా అందజేశారు. అయితే అవేమీ వాడుకలో లేకుండా నిరుపయోగంగా దుమ్ము పట్టిస్తున్నారు.

దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రధానంగా సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ విభాగం ఏర్పాటు అవసరముంది. ఈ ప్రాంత ప్రజలు అనేక మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకునేందుకు తిరుపతి, చెన్నై తదితర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రధానంగా పేదలు సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అమలు కాని హామీ

సత్యవేడు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా అభివద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. సత్యవేడు గడియారం కూడలిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు నా బాధ్యత అంటూ స్థానికులకు మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా నేటికీ సత్యవేడు ఆస్పత్రి అభివద్ధికి ఒక్క అడుగు కూడా పడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించినా..

సత్యవేడు సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రి స్థాయికి అభివృద్ధి చేసేందుకు రూ.7కోట్లతో అన్ని హంగులతో కూడిన భవనాన్ని గతంలో నిర్మించారు. అయితే కోవిడ్ సమయంలో అత్యవసర సేవలకు ఆ భవనాన్ని కొద్ది రోజుల పాటు ఉపయోగించారు. తర్వాత అది నిరుపయోగంగా మిగిలిపోయింది. గతంలో ఉన్న పాత ఆస్పత్రి భవనంలోనే ప్రజలకు వైద్యం చేస్తుండడం గమనార్హం.


బ్లడ్ స్టోరేజ్ గది


మూతపడిన టీకాల గది

కంటి పరీక్షలు దూరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంటి వైద్యం కోసం ఆస్పత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ విభాగం పూర్తిగా మూతపడింది. కంటికి సంబంధించిన వైద్యసేవలు దూరమయ్యాయి.


వాడుకలో లేని వైద్యసిబ్బంది గదులు


దుమ్ము పడుతున్న దాతలిచ్చిన పడకలు


నిరుపయోగంగా ఐసీటీసీ గది

నాలుగు ఆవులు మృతి


పరిశ్రమ నుంచి వస్తున్న వ్యర్థ జలాలు

పెళ్లకూరు : మండలంలోని పాలచ్చూరు గ్రామంలో రామ్‌కో ఎన్విరో ఇంజినీరింగ్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలను తాగడంతో ఆదివారం నాలుగు ఆవులు మృత్యువాత పడ్డాయి. రామ్‌కో ఎన్విరో ఇంజినీరింగ్ పరిశ్రమ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యర్థ జలాలు వదిలేస్తున్నారు. అటుగా వెళ్లిన మూగజీవాలు వ్యర్థ జలాలను తాగి మృతి చెందుతున్నాయి. బాధితులు కాటూరు గోవర్ధన్, బట్టా వెంకటసుబ్బయ్య, బట్టా రమేష్ మాట్లాడుతూ తమ ఆవులు మరణించడంతో రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

అనారోగ్యంతో జీవితఖైదీ..

తిరుపతి క్రైం: అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతి చెందిన ఘటన ఆదివారం స్విమ్స్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ కథనం.. నెల్లూరులోని మైపాడుకు చెందిన షేక్‌కాలేశా(64) ఓ వ్యక్తిని హత్య చేసి నెల్లూరు సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. అయితే గత కొద్దిరోజులుగా అనారోగ్యంగా ఉండడంతో నెల్లూరు జైలు పోలీసులు సిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ షేక్‌కాలేశా మృతి చెందాడు.

29న పోలీస్ సమన్వయ కమిటీ సమావేశం

తిరుపతి క్రైం: తిరుపతిలో ఈనెల 29వ తేదీన దక్షిణాది ప్రాంతీయ పోలీస్ సమన్వయ కమిటీ సమావేశం తాజ్ హోటల్‌లో జరగనుంది. ప్రధాని ఆదేశాల మేరకు దక్షిణాది రాష్ట్రాలైన ఎనిమిది మంది డీజీపీలు సమావేశం కానున్నారు. ఇందులో కీలకమైన పోలీసింగ్ అంశాలపై, అంతర్రాష్ట్ర సహకార సమన్వయ బలోపేతం పై చర్చించనున్నారు.

ఆలయం కూల్చివేతకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు


అధికారిని ప్రశ్నిస్తున్న స్థానికుడు

చంద్రగిరి : సనాతన ధర్మం పరిరక్షణే లక్ష్యమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వంలో రహదారి నిర్మాణం పేరిట ఆలయం కూల్చేందుకు యత్నించారు. ఆదివారం ఈ మేరకు స్థానికులు అడ్డుకున్నారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ పరిధిలోని నేతాజీ నగర్‌లో వినాయ స్వామివారి ఆలయాన్ని కాలనీ వాసులే నిర్మించుకున్నారు. స్వామివారికి కైంకర్యాలను నిర్వహించుకుంటున్నారు. మరో నాలుగు రోజుల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభంకానున్న తరుణంలో ఆలయ అలంకరణకు సన్నద్ధమయ్యారు. సన్నాహాలు చేస్తున్నారు.

రహదారి పేరిట కుట్ర

తిరుచానూరు సమీపంలోని ఓరియన్ హోటల్ నుంచి పద్మావతిపురం వరకు సుమారు రూ.4కోట్ల టీటీడీ నిధులతో తుడా ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి పూనుకున్నారు. అయితే శిల్పారామం వెనుక చెరువు కట్టపై ఈ పనులు చేపట్టారు. అయితే రహదారి విస్తరణలో భాగంగా చెరువు పక్కన ఉన్న శ్రీవినాయక స్వామి ఆలయాన్ని కూల్చివేసేందుకు కొంతమంది అధికారులు, నేతలు యత్నించారు. దీంతో ఆదివారం స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. స్వార్థరాజకీయాల కోసం గుడిని కూల్చివేయాలని చూడడం దారుణమని మండిపడ్డారు. చెరువు స్థలం ఉన్నప్పటికీ, గుడిని తొలగించేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాలను ధ్వంసం చేయడం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించినా, కూటమి ప్రభుత్వంలో దాడులు మాత్రం ఆగడం లేదని వాపోతున్నారు. అయితే సోమవారం మరోసారి అధికారులు రోడ్డు నిర్మాణానికి సంబంధించి పరిశీలనకు రానున్నట్లు తెలిసింది.

ప్లాస్టిక్ తయారీని అరికట్టాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

చిల్లకూరు : వాతావరణ కాలుష్యం నిర్మూలించేందుకు ముందుగా ప్లాస్టిక్ తయారీని అరికట్టాలని, ఈ మేరకు ఆయా పరిశ్రమలను మూసివేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం సూచించారు. ఆదివారం గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మూఢ నమ్మకాలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో జేవీవీ పాత్ర కీలకమన్నారు. విద్యార్థులను చైతన్యవంతం చేసి వారి ద్వారా మరింత ప్రచారం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, శర్మ, అశోక్ పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థులకు ఇంటరాక్టివ్ సెషన్


ఐఐటీ విద్యార్థులతో వడోదర ఎంపీ హేమంగ్ జోషి

ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల విభాగం సంయుక్తంగా గుజరాత్‌లోని వడోదర ఎంపీ డాక్టర్ హేమాంగ్ జోషితో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీపై విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రజాస్వామ్యం, పాలన, ప్రజా విధానం డైనమిక్స్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విధాన ఔత్సాహికులకు సూచనలు ఇచ్చారు. ఐఐటీ డైరెక్టర్-ఇన్-చార్జ్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మా పాల్గొని యువతకు సాధికారత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిందని కొనియాడారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరి మృతి

పెళ్లకూరు : నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై చిల్లకూరు సమీపంలో ఆదివారం రాత్రి రెండు మోటారుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన చమర్తి కృష్ణయ్య(39) మృతి చెందగా, కోటకు చెందిన చీరా రోశయ్య గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మోహనమ్మ, కుమార్తెలు చంద్రలేఖ, ప్రవీణ, కుమారుడు శ్రీనాథ్ ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తిరుపతి క్రైమ్ : వ్యవసాయ, పోలీస్ శాఖ సమన్వయంతో ఆదివారం తిరుపతిలోని ఎరువుల షాపులపై దాడులు నిర్వహించారు. యూరియా, నానో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు నానో యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. నానో యూరియా ఎకరానికి అర లీటర్ పిచికారీ చేసుకున్నట్లయితే సాధారణ యూరియాతో పోల్చుకుంటే అధిక శాతం నత్రజని పంటకు లభిస్తుందని, డీలర్లు, రైతులకు అవగాహన కల్పించారు. 45 కేజీల యూరియా బస్తా అర లీటర్ నానో యూరియాతో సమానమని వెల్లడించారు. తనిఖీల్లో ఈస్ట్ సిఐ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుడి వైన్‌షాపుపై దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పుత్తూరు పరిధిలోని కార్వేటినగరం మార్గంలో కల్యాణపురం వద్ద కల్లుగీత కార్మికుడి మద్యం దుకాణంపై లక్కీ డిప్ ద్వారా వైన్‌షాప్ దక్కించుకున్న నిర్వాహకుడు దాడికి పాల్పడ్డాడు. కరెంట్ కట్ చేసి దౌర్జన్యం చేశాడు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ కల్లుగీత కార్మికుడిగా వైన్ షాపును దక్కించుకున్నామన్నారు. అప్పటి నుంచి బెదిరింపులు వస్తున్నాయని వెల్లడించారు. టీడీపీ అండ ఉందని లక్కీడిప్ ద్వారా వైన్ షాపు దక్కించుకున్న నిర్వాహకుడు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాడని ఆరోపించాడు. షాపు పెట్టనివ్వకుండా ఇబ్బంది పెట్టాడని, అధికారులు చూపించిన స్థలంలో దుకాణం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక అప్పటి నుంచి షాపు నిర్వహించుకోకుండా నానా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్


పట్టుబడిన బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : నగరంలో మోటార్‌సైకిళ్లు అపహరిస్తున్న పి.కుమార్ అనే నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుచానూరు కొత్తవీధికి చెందిన కుమార్ జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. తిరుచానూరుకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తుండగా చోరీ విషయం బట్టబయలైందని తెలిపారు. నిందితుడి నుంచి రూ.40 లక్షల విలువైన 53 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నేడు వరాహస్వామి జయంతి

తిరుమల: ఆదివరాహక్షేత్రమైన తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం వరాహ జయంతి జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం కలశ స్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేయనున్నారు. ఆ తరువాత పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లు, వివిధ రకాల పండ్లతో తయారు చేసిన పంచామృతంతో వేదోక్తంగా మూలవర్లకు ఏకాంతంగా అభిషేకం నిర్వహించనున్నారు.

యోగా టోర్నీకి ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న కరస్పాండెంట్ రాజేష్

తిరుపతి సిటీ : తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న లిటిల్ స్టార్ స్కూల్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా యోగా అసోసియేషన్ వారు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక పోటీలు నిర్వహించారు. మదనపల్లె, పీలేరు, చిత్తూరు, కుప్పం, శ్రీకాళహస్తి నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ రాజేష్, అసోసియేషన్ నేతలు మనోహర్ రెడ్డి, బి.కేశవ్, కె.రమణ, మాధవి, రెడ్డి కుమార్, శ్రీధర్, అపర్ణ దేవి, ఆదర్శ సతీష్, అనిత పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం


జ్యోతి ప్రజ్వలనతో క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్

తిరుపతి సిటీ : రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, తెలిపారు. ఆదివారం తిరుపతి తారకరామా స్టేడియంలో అమరావతి చాంపియన్ షిప్-2025 రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. తిరుపతిలో క్రీడారంగం అభివృద్ధికి 30ఎకరాలు కేటాయించామని చెప్పారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మించనున్నట్లు వివరించారు. మెగా డీఎస్సీతో సుమారు 450 అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. అమరావతి చాంపియన్ షిప్‌లో ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్, హాకీ , కబడ్డీ, ఖోఖో, షటిల్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ ఎండీ గిరీష్ కుమార్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, సినీ నటుడు నారా రోహిత్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, జాతీయ స్థాయి క్రీడాకారిణి రజని, డీఎస్‌సీఓ శశిధర్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

- డ్రోన్ కెమెరాలతో వెంటాడిన ప్రత్యేక బృందాలు
- 25మంది పందెం రాయుళ్ల అరెస్ట్


పరుగులు తీస్తున్న పందెంరాయుళ్లు

ఏర్పేడు : రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని జంగాలపల్లె, మద్దిలేడు, దుర్గిపేరి, శివగిరి కాలనీ, కాత్రకాయలగుంట, జంగాలపల్లె ఎస్టీ కాలనీల్లో డ్రోన్ కెమెరాలతో పోలీసులు ఆదివారం బీట్ నిర్వహించారు. చిందేపల్లె ఎస్టీ కాలనీలోని కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి తిరుపతి స్పెషల్ పార్టీ టీమ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పర్యవేక్షణలో దాడులు చేశారు. పందెంరాయుళ్లు, నిర్వాహకులను వెంటాడి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. 11 కోడి పుంజులు, రూ.61,116 నగదు, 29 సెల్ ఫోన్లు, 30 ద్విచక్ర వాహనాలు, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై 80999 99977 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

దొరవారి సత్రంలో..


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసుల దాడులు నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో కోడి పందెం నిర్వహిస్తున్న విషయం గుర్తించిన పోలీసులు వెంటనే వెళ్లి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.20,100 నగదు, నాలుగు కోళ్లు, ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- పట్టించుకోని అధికారులు


యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్న దృశ్యం

తొట్టంబేడు: శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. తొట్టంబేడు మండలం మీదుగా వెళుతున్న స్వర్ణముఖి నదిలో భారీగా ఇసుక దందా సాగిస్తోంది. పెద్దపెద్ద ప్రొక్లైన్ల సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్లకు నింపి రాత్రి, పగలు తేడాలేకుండా తరలించేస్తోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నదీ పరివాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల ఎకరాల మేర బీడు భూములుగా మారే పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని విరూపాక్షపురం గ్రామ పరిసరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే అధికారుల అండతో ఇసుకను తరలిస్తున్నట్టు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

'అగ్నివీర్'కు 159మంది అర్హత


రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు

తిరుపతి రూరల్ : అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో ఎస్వీ డిఫెన్స్ అకాడమికి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ అకాడమి ఛైర్మన్ బి.శేషారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచితంగా ఫిజికల్ ట్రెనింగ్ ఇచ్చామని, వారు ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. తొలుత ఆ 159 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.